# పాపిరెడ్డి ద గ్రేట్!

పాపిరెడ్డి ప్రైమ్ మినిస్టర్ కావల్సినవాడు. కానీ...రాజకీయాల్లో కాలుపెట్టినప్పటి నుండి రాష్ట్రానికే అంకితమైనాడు.

వరుసగా నాలుగేళ్లు శాసన సభలో అత్యంత అధిక మెజిరిటితో ఎన్నికై.. ప్రతిపక్షంలో కూర్చుని ఇక రాజకీయ సన్యాసం చేద్దామనుకుంటున్న తరుణంలో పాపిరెడ్డి పార్టీ, పదవిలో కొచ్చి అతగాడు ఏక గ్రీవంగా ముఖ్యమంత్రి అయ్యాడు. అది అతగాడిలక్!

పాలిటిక్స్‌లో పావులు తెలివిగా కదపగల సమర్థుడు పాపిరెడ్డి! పాపిరెడ్డి అంటే రాష్ట్ర యావత్తుకి హడలే!

అతని మాటకి ఎదురు లేదు. పుట్టినప్పటి నుండి పాపి రెడ్డి అన్నీ వెధవ పనులే చేసాడు.

బాగా బలిసిన ఫ్యామిలీలో పుట్టటం మూలాన చదువులో కూడా తాను మేధావి తనం నిరూపించుకుని ఇంజనీరింగ్ చదివాడు.

ఎంచక్కా వుద్యోగం చేయకుండా రాజకీయాల్లో తలదూర్చి ఎత్తులు.. పొత్తులు... గమ్మత్తులు... నేర్చుకుని నాయకుడిగా అరితేరాడు.

రౌడీయిజం.. హత్యల్లాంటి వాటి జోలికి తానుగా పోకుండా... అటువంటి పన్లు తన వర్గం సభ్యులకి అప్పగించి... అనుకున్నది సాధించే మేధావి పాపిరెడ్డి.

పాపిరెడ్డి పాపాల చిట్టా రాష్ట్రంలో తెలియనివారు లేరు. అతనికి ఏ విధంగానూ ఎదురు చెప్పలేక... నిలబడి పోరాడలేక ఛోటా మోటా నాయకులంతా పాపిరెడ్డికీ 'జై' కొట్టారు.

ఏకఛత్రాధిపత్యంగా అధికారాన్ని హస్తగతం చేసుకుని రాష్ట్రాన్ని పాలిస్తున్న పాపాల చిట్టా ఏటా పెరిగి పోతూండటం వల్ల కొంతలో కొంత అందరిలోనూ అసంతృప్తి నెలకొన్నా పైకి మాత్రం పళ్లికిలిస్తూ నవ్వేస్తూ భజన బృందం కాలంగడుపుతోంది.

అపోజిషన్ వారు ప్రతి చిన్నదానికీ దుమ్మెత్తి పోస్తున్నా లక్ష్య పెట్టని పాపిరెడ్డి...తనదైనపంథాలో పరిపాలన సాగిస్తున్నాడు.

కానీ.. మళ్లీ ఎన్నికలు దగ్గర పడుతూండటంతో పాపిరెడ్డిలో అనూహ్యమైనభయం.. కలవరం చోటు చేసుకో నారంభించినయ్. మనిషిలో ధైర్యం రానురాను సడలుతోంది. తన మీద తనకు గల నమ్మకం దూరమవుతోందా అన్పిస్తోంది.

రానున్న శాసన సభ ఎన్నికల్లో గెలుపు ఎవరిని వరిస్తుందో.. తనకు మళ్లీపదవి దక్కే అవకాశం వుంటుందో లేదోనే శంక మనిషిని పట్టి పీడిస్తోంది.

గంభీరంగా వుంటూ తనను ఢీకొని గెలవగల వారు రాష్ట్రంలోనే లేరనే ధీమా పైకి వ్యక్తంచేస్తున్నాడు.

కానీ... తన వాళ్లనుకున్న వారిలో అసమ్మతి వర్గమొకటి ఊపిరి పోసుకుంటోందని ఏనాటికైనా వారంతా బలిసి కలిసికట్టగా తనపై ప్రచ్ఛన్న యుద్ధం ప్రకటించ వచ్చునేమోననే శంకపట్టి పీడుస్తోంది.

పాపిరెడ్డి అంటే చండప్రచండుడు! భూమిని ఆకాశాన్నీ ఏకం చేయగల చాణక్యుడు. ఎవరికీ దొరకని మేధావి. ఎవరికీ అందని రాచకీయ చతురుడు.

ఎన్నో సమస్యలతో రాత్రింబవళ్లు సతమతమౌతున్నా..ఆకర్షణీయమైన ప్రజాపథకాలను అమలు పరుస్తూ... ముందుకు సాగిపోతున్నాడు పాపిరెడ్డి.

కార్యాలయంలో ఫైళ్లమీద సంతకాలు పెడుతున్న పాపిరెడ్డికి తలవని తలంపుగా ఏడాది క్రితం ఆకస్మికంగా మృత్యు వాత పడిన ఒక్కగానొక్క వంశాంకురం అయిన కిషోర్ గుర్తు కొచ్చాడు.

పాపిరెడ్డి ప్రజల దృష్టిలో రావణాసురుడు... రాక్షసుడే అయినా... కొడుకు హఠాన్మరణానికి కన్న తండ్రిగ చలించిపోయాడు.

కిషోర్ లేకలేక కలిగిన ఏకైక సంతానం! అల్లారు ముద్దుగా పెంచాడు. పై చదువు కోసం ఏరి కోరి కన్న కొడుకుని విదేశాలు పంపాడు.

చదువు పూర్తి చేసుకుని తిరిగొచ్చాక కిశోర్ చేత ఎన్నో ఇండస్ట్రీస్ పెట్టించాలని తీపి కలలు కన్నాడు.

తాను చేసిన పాపాల ఫలితమో ఏమో... కిషోర్ విదేశాల్లో... విలాస వంతమైన జీవితానికి అలవాటు పడ్డాడు. ఆ విషయం ఎంతో దూరంలో నున్న పేరెంట్స్‌కి తెలియనీయకుండా గోప్యంగ వుంచాడు.

కంటికి నచ్చిన ఆడదాని వెంటల్లా తిరిగాడు. స్త్రీ వ్యసనానికి బానిసై... హెచ్.ఐ.వీ. పాజిటివ్ సోకి... అతి దారుణమైన స్థితిలో మృతి చెందాడనే నిజం పాపిరెడ్డి తెలుసుకుని గుండె బాదుకున్నాడు. గది తలుపులు బిడాయించుకుని ఓ నెల రోజుల పాటు బైటి ప్రపంచానికి తనముఖం చూపలేక కుమిలిపోయాడు.

ఎందరు ఎన్ని రకాలుగా ఓదార్చినా పాపిరెడ్డి గుండె బరువు తగ్గలేదు. తనకు తల కొరివి

పెట్టాల్సిన వంశాంకురం ... తన కళ్లముందే అతి దారుణంగా చనిపోవటాన్ని తట్టుకోలేక పోయాడు.

ఇంకా తనెవరికోసం బ్రతకాలి?... ఎవరి కోసం రాజకీయాల్లో వుండాలి?.. ఎవరి కోసం తాను కూడబెట్టాలి?... పాపిరెడ్డిలో అన్నీ ప్రశ్నలే...

కిషోర్ భౌతిక కాయాన్ని ప్రత్యేక విమానంలో ఇండియాకి తెప్పించాడు.

చితికి నిప్పంటించిన పాపిరెడ్డి స్పృహ తప్పిపడిపోయాడు.

కొడుకు అకాల మరణానికి షాకైన పాపిరెడ్డి... దుఃఖం బాధనుంచి తేరుకోవటానికి చాలా రోజులు పట్టింది.

తన కిషోర్ ఎయిడ్స్ బారిన పడ్డాడని తెల్సి గుండెపగిలేలా ఏడ్చాడు. తాను పదవిలో వుండగానే కన్నకొడుకు గుర్తుగా ఏదైనా ఒక బృహత్కార్యాన్ని చేపట్టాలని నిర్ణయంచుకున్నాడు.

'కిషోర్ ఎయిడ్స్ పెన్షన్ పథకం' అనే దాన్కొక దానిని రూప కల్పన చేసి మంత్రివర్గంతో చర్చించి దానిని అమలు చేస్తేగాని పాపిరెడ్డికి మనసు కుదుట పడదన్పించింది.

ఎయిడ్స్ బారిన పడిన బాధితులకు ఈ పెన్షన్ పథకం అందచేసి వారిలో ఆశలు చిగురింపచేయాలనేదే పాపిరెడ్డి సంకల్పం.

తాను మున్ముందు... అధికారంలో వున్నా అసలు రాజకీయ సన్యాసమే స్వీకరించినా... తాను బ్రతికి వున్నన్నాళ్లు ఈ పథకం అమలులో వుండేట్టు పటిష్ఠమైన చర్యలు తీసుకున్నాడు.

ప్రతి ఎయిడ్స్ బాధితుడికీ నెలనెలా పింఛను కింద పదివేల రూపాయలు అందేట్టు ప్రణాళిక రూపుదిద్దుకుంది.

ఒక ఆశయంతో పాపిరెడ్డి తలపెట్టిన వినూత్న పెన్షన్ పథకానికి రాష్ట్రం నలుమూలల నుంచి విశేషస్పందన లభించింది. యావన్మందీ సి.ఎం. సదాశాయాన్ని కీర్తించారు.

ఈ పెన్షన్ పథకానికి విస్తృత ప్రచారం జరిగింది. ఈ పథకానికి కేంద్రం ఆమోదముద్ర లభించింది.

బాధితులకు తొలివిడత పింఛను చెక్కులు స్వయంగా పాపిరెడ్డి చేతుల మీదుగా అందచేయబడినయ్!. మలివిడత వైద్య ఆరోగ్యశాఖమంత్రివరేణ్యుల చేతుల మీదుగా అందచేయటం జరిగింది.

★★★★★

ప్రభుత్వం అందించే పెన్షన్ సొమ్ము బాధితులకు సరిపోదని అన్పించటంతో... తనకున్న

యావదాస్తిని ఒకట్రస్ట్‌గా ఏర్పరచి... దానిమీద వచ్చే ఆదాయాన్ని కూడా ఎయిడ్స్ బారినపడేవారికి అందచేయాలని సంకల్పించాడు పాపిరెడ్డి!.

ఈ సత్కార్యంతోనైనా తాను చేసిన దుర్మార్గాలు... మూటకట్టుకున్న పాపాలనుంచి విముక్తుడు అవగలిగితే అంతేచాలు అన్పించింది.

పాపిరెడ్డి నిర్ణయం తెల్సుకున్న రాష్ట్ర ప్రజానీకం... అతని త్యాగనిరతిని వేనోళ్ళకొనియాడి బ్రహ్మరథం పట్టారు.

పథకం ప్రవేశపెట్టిన కొద్దినెలల్లోనే రాష్ట్రంలోగల ఎయిడ్స్ బాధితుల సంఖ్య రెట్టింపు కావటం చూచి రాష్ట్ర మంత్రివర్గం నివ్వేరపోయింది. పాపిరెడ్డి దిగ్భ్రాంతి చెందాడు.

బాధితులసంఖ్య అనూహ్యంగ పెరగటానికిగల కారణాలను అన్వేషించమని వైద్య ఆరోగ్యశాఖ మంత్రికి ఆదేశాలిచ్చాడు సి.ఎం. పాపిరెడ్డి!.

పెన్షన్ పథకం ప్రారంభం నాటికి మూడంకెల్లోవున్న బాధితుల సంఖ్య పెరిగిందీ అంటే... అసలైన బాధితులే కాకుండా.. ఇతరులూ తోడై పథకాన్ని నీరుకార్చే ప్రయత్నం చేస్తున్నట్టుగా అన్పించటంతో నిఘా గూఢచారి సంస్థను అతిరహస్యంగా కారణాలు తెల్సుకుని తనకు వీలైనంత త్వరలో నిజాలను తెల్పమంటూ ఆదేశించాడు.

లొసుగులు... లోటుపాట్లు వుండకూడదని సక్రమంగా... సజావుగా 'కిశోర్ ఎయిడ్స్ పెన్షన్ పథకం' కొనసాగాలని ఆశించాడు. కానీ... చూస్తూంటే... పథకం ప్రయోజనాన్ని బాధితులతో పాటు ఇతరులు కూడా పొందుతూ పథక ప్రయోజనాలను దుర్వినియోగ పరస్తున్నట్టు... నిఘా విభాగం వారు అందించిన భోగట్టాను రహస్యంగా వుంచి... ఎయిడ్స్ వ్యాధి సోకిన వారు సమర్పించే మెడికల్ సర్టిఫికేట్లన్నింటినీ... పోలీసు డిపార్ట్‌మెంట్ వారికి అప్పగించి... ముగ్గురు వైద్యాధికారులతో ఏర్పరచిన కమిటీని స్రూటినీ నిర్వహించవలసిందిగా సి.ఎం. పాపిరెడ్డి ఆదేశాలు జారిచేసాడు.

బాధితులు సమర్పించిన మెడికల్ రిపోర్ట్ పరిశీలించిన తర్వాత వాటిలో అధిక భాగం... కొందరు వైద్యులు డబ్బుకి ప్రలోభపడి... వ్యాధి లేకపోయినా దొంగ సర్టిఫికేట్లు జారీ చేయటం జరిగిందనీ... ఆ కారణంగానే బాధితుల సంఖ్య అనూహ్యంగా పెరిగిందని... దొంగ సర్టిఫికేట్ల వెనుక పెద్ద 'రాకెట్' వుందనే నిజాలను కనుగొని వెలికితీసి... విషయాన్ని సి.ఎం. పాపిరెడ్డికి తెలీచేయటం జరిగింది.!

విషయం తెల్సుకున్న పాపిరెడ్డి 'ఫైరై'నాడు.

దోషులు ఎవరైనా.. ఎంతటి వారైనా.. దొంగ సర్టిఫికేట్లు ఇస్తున్న రాకెట్‌ను ఛేదించి... నిందితులపై కఠిన చర్యలు చేపట్టాలని వైద్య ఆరోగ్య శాఖ మినిస్టర్‌కి ఆదేశాలు జారీ

చేసాడు పాపిరెడ్డి.

పోలీసువారు రంగంలోకి దిగి రాష్ట్రంలో పెద్ద ఎత్తున.. ఎయిడ్స్ సోకిందని... వ్యక్తులకు ఇస్తున్న దొంగ సర్టిఫికేట్స్ ఇచ్చిన వారిని అరెస్ట్ చేసి కస్టడీ లోకి తీసుకున్నారు.

వారిలో డాక్టర్లు... వుద్యోగులు... మరి కొంత మంది ఇతరులు వున్నారనే విషయం తెల్సుకున్న పాపిరెడ్డి... ఈ దుశ్చర్యకు పాల్పడ్డ ప్రభుత్వోద్యోగులను సస్పెండ్ చేయమన్నాడు.

అన్ని పత్రికలూ... ఈ వార్తలను ప్రముఖంగా ప్రచురించినయ్.

దొంగ సర్టిఫికేట్స్ ఇచ్చి... సస్పెన్షన్‌కి గురైన వారంతా తిప్పలు పడి బెయిల్ మంజూరు చేయించుకోవటానికి కోర్టులను ఆశ్రయంచారు.

విచారణలో దోషులుగా నిర్బంధింపబడిన ఉద్యోగులకు తగిన శిక్ష విధించింది చట్టం!

కోర్టులో శిక్షపడిన వారందరిని వుద్యోగాల్లోంచి డిస్మిస్ చేసింది ప్రభుత్వం!

అక్కడితో దొంగ సర్టిఫికేట్లు ఇచ్చిన రాకెట్ పనిపట్టినట్టూ...బాధ్యులైన వారిని శిక్షించినట్టూ అయింది. .. సి.ఎం. పాపిరెడ్డి తలపెట్టిన కిశోర్ ఎయిడ్స్ పెన్షన్ పథకం నిరాటంకంగా సాగిపోతోంది.

అందుకే అంతా సి.ఎం.ను. పాపిరెడ్డి ద గ్రేట్ అన్నారు.

-:(సమాప్తం):-